డి. శ్రీవల్లీ రాధిక

# ఉద్యమం

మిట్టమధ్యాహ్నపు ఎండలో చెమటలు కక్కుతూ బస్‌స్టాప్‌కి వచ్చాడు నర్సిమ్మ. టికెట్ కొనగా మిగిలిన చిల్లర డబ్బులని లెక్కపెట్టుకుంటూ హైదరాబాద్ బస్సెక్కాడు.

మొత్తం అయిదురూపాయలుంది. "ఈ చిల్లర డబ్బులతో ఎట్టా ఎతకాలో అమ్మని!" గుండెలు బితుకు బితుకుమంటున్నాయి.

"..ఒక్కసారి.. ఒక్కసారి.. మీ అమ్మని తీసుకురారా నర్సిమ్మా. సూసి చచ్చిపోతా" తండ్రి ఏడుస్తూ అన్న మాటలు గుర్తొస్తే పట్టుదల పెరుగుతోంది. "ఎట్టనోకట్ట తెలుసుకోలేకపోతానా!" అని ధైర్యం వస్తోంది. అంతలోనే.. "అసలు ఏడ్నని వెతకాలి అంత పెద్ద పట్నంలో.." అన్న ఆలోచనతో దిగులు ముంచుకొస్తోంది.

"ఉన్నది వున్నట్టూ యింతపని ఎట్టా సేసిందో అమ్మ!" అసహనంగా అనుకున్నాడు.

"తాగినా తన్నినా ఆడు నాకు దైవం" అనే యాదమ్మ, రాజయ్యని వదిలేసి పోయిందంటే.. నర్సిమ్మకే కాదు అసలు ఎవరికీ నమ్మబుద్ధెయ్యలేదు మొదట.

రాజయ్యా నమ్మలేదు. "అదెక్కడికి పోతదిరా! మీ ఎర్రి గాకపోతే. ఈ రోజేమైనా కొత్తగా తాగొచ్చినానా ఏంది! పుట్టినకాడ్నించీ నేను తాగతా వున్నా. అది సూస్తా వుంది" అన్నాడు భరోసాగా.

రెండ్రోజులయ్యాయి. నాలుగురోజులయ్యాయి. వారమయింది. నెలయింది. అప్పుడర్థమయింది అందరికీ.. యాదమ్మ శాశ్వతంగా రాజయ్యని వదిలేసిందని.

తన దారి తను చూసుకుందని.

అర్ధమయ్యాక కూడా నాలుగురోజులు బింకంగానే వున్నాడు. "నేనేమైనా పనిలేక తాగతన్నానా ఏంది! రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని రిచ్చా లాగేటోడ్ని.. నా డబ్బుల్తో నేను రెండు సుక్కలు నోట్లో ఏసుకుంటే, అదేమన్న గోరమా!" అంటూ వాదన మొదలుపెట్టాడు.

"మీకోసం గాదంట్రా నేనిట్టా కట్టపడేది!" అని గర్జించాడు.

చూసి చూసి నర్సిమ్మ కసిరాడు. "సాల్లే వూర్కో అయ్యా.. మాకోసం నువు సంపాదించింది పైస లేదు. నీ డబ్బంతా నీ తాగుడుకే సరిపోయె... అమ్మ సంపాదనలో సగం నీ కొరకే కర్సాయె. ఇట్లూ.. తమ్ములూ తప్ప నువు మాకిచ్చిందేం లేదు" అన్నాడు.

రాజయ్య కిమ్మనలేదు. తనలో తనే గొణుక్కుంటూ ముడుచుకుని పడుకున్నాడు.

నర్సిమ్మకే జాలేసింది. తండ్రి అరుపుల వెనుక వున్నది తల్లి మీద ప్రేమేనని అతనికి తెలుసు.

అయితే ఆ ప్రేమ రాజయ్య గొప్పదనం కాదు. యాదమ్మ గొప్పదనం. పోతే పోయిందిలే అనుకోగలిగిన మనిషి కాదు యాదమ్మ. ఎంత చేసింది ఆమె రాజయ్య కోసం! ఎంత కష్టపడేది!

ప్రొద్దున్నే నాలుగిళ్ళలో పాచిపని చేసేది. ఆ తర్వాత కూలికి వెళ్ళేది. మళ్ళీ సాయంత్రం ఆ నాలుగిళ్ళలోనూ పని చూసుకుని గుడిసెకొచ్చేది.

పొట్టిగా, సన్నగా, రాజయ్య ఎడమ చేతిలో యిమిడిపోయేలా వుండే యాదమ్మ అంత పని ఎట్లా చేసేదో!

ఒంట్లో వున్న శక్తి అంతటినీ పని కోసమే ఖర్చు పెట్టదల్చుకున్నట్లూ ఎప్పుడూ మౌనంగా వుండేది. "పుట్టినకాడ్నుంచీ.. యిప్పటిదాకా మొత్తం పదిమాటలు కూడా మాట్టాడుండదేమో అమ్మ" అనుకుంటాడు నర్సిమ్మ.

సంవత్సరం క్రితం.. సారా వుద్యమాలప్పుడు జరిగిన సంఘటన వాడి కళ్ళ ముందు మెదిలింది.

ఆరోజే టెన్త్ క్లాస్ మార్కులు వచ్చాయి. ఫస్ట్ క్లాస్ వచ్చింది తనకి. అమ్మతో చెప్పాలని పరుగెత్తుకుంటూ వెళ్ళాడు.

తను వెళ్ళేసరికి .. సుజాతమ్మగారింట్లో అంట్లు తోమేసి, అన్నం, కూరలూ గిన్నెలో సర్దుకుంటోంది అమ్మ.

తను వెళ్ళగానే ఆవిడ పిలిచింది. "ఒరే నర్సిమ్మా! ఇట్లా రారా. నువ్వన్నా చెప్పరా మీ అమ్మకి" అంటూ.

"ఏందమ్మగారూ!" అంటూ దగ్గరికెళ్ళాడు తను.

ఆవిడ నిలదీసింది. "ఏరా నర్సిమ్మా! మీ అయ్య రోజా తాగొస్తాడా! మీ అమ్మని చావదన్ని కానీ నిద్రపోడా! తను మిమ్మల్ని పోషించకపోగా.. మీ అమ్మ కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంటే, అది కూడా సాగనివ్వకుండా ఆ డబ్బులన్నీ లాక్కుంటాడా!"

తను తల వూపాడు. "అవునండమ్మగారూ! మానాన్న తాగకపోతే మేము యింకా బాగుండేవాళ్ళం" అన్నాడు.

"అవునా! మరి చూడరా! రాష్ట్రమంతటా యింత పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతూంటే.. మీ అమ్మలాంటివాళ్ళు వుద్యమంలోకి రాకపోతే ఎలా చెప్పు! రేపు ధర్నా చేస్తున్నాం. బోల్డుమంది ఆడవాళ్ళు వస్తారు. మీ అమ్మని కూడా రమ్మంటే రానంటూంది. గంటనుంచీ చెప్తున్నాను. ముంగిలాగా ఒక మాటన్నా మాట్లాడదే!" అంది ఆవిడ సహనం చచ్చిపోయి.

అమ్మ ఏమీ మాట్లాడలేదు. అసలు అదంతా తన గురించి కానట్లూ.. ఎవరి గురించో ఎవరో చెప్పుకుంటున్నట్లూ.. గిన్నెలు సర్దుకుని, "పోతన్నానమ్మగారూ!" అంటూ బయటకి నడిచింది.

సుజాతమ్మ తమ వెనకాల ఒక నిట్టూర్పు విడిచి లోపలికెళ్ళింది.

బయటికొచ్చాక తను చెప్పాడు మంచిమార్కులొచ్చాయని. అమ్మ సంతోషంగా దగ్గరికి తీసుకుంది.

"ఐ. టి. ఐ. లో జేరి ఫిట్టర్ కోర్స్ చేస్తానే. తొరగా వుద్యోగమొస్తది" అన్నాడు తను.

"చదివిస్తనయ్యా. సక్కగా సదువుకుని మంచి వుద్యోగం జేసుకో. మీనాన్నలాగా గామాకు" అంది కళ్ళల్లో నీళ్ళు నింపుకుని.

"అదేందమ్మా!"

" అవున్రా నాయనా! అమ్మగారు చెప్పిందంతా నిజం. ఈ దిక్కుమాలిన సారా లేకుంటే నిజంగానే మీ అయ్య యిట్లుండడు. అది పోవాల్రా అయ్యా. పోవాలి." అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

"కొట్లలో బెట్టి అమ్మినంతకాలం మీ అయ్య లాంటోళ్ళు తాగతనే వుంటారు. ఆరోగ్గాలు సెడగొట్టుకుంటనే వుంటారు."

"మరి రేపు నువ్వు కూడా పోరాదా అమ్మా!"

"ఎట్టారా! కూలికి పోకుంటే డబ్బులెట్టా వస్తాయిరా!"

"పోనీ రేపొక్కరోజా నేను పోతాలే కూలికి. నువ్వెళ్ళి ధర్నా చెయ్యి" అన్నాడు తను.

"వద్దొద్దు. అట్లొద్దు" అంది కంగారుగా.

"ఏందమ్మా! ఏమవుతది!"

"వద్దురా అయ్యా. నువు చేయలేవు ఆ పనులు. చేసొచ్చినా ఒళ్ళు నొప్పులంటూ మీ అయ్యలాగే తాగుడు మొదలెడ్తావు" అంది భయంగా.

తను నవ్వాడు. "పోమ్మా. అదేం కాదులే. రేపు నువ్వెళ్ళు. ధర్నా ఎట్లా చేస్తారో చూసిరా. చెల్లిని గూడ తీస్కెళ్ళు" అన్నాడు.

మర్నాడు అమ్మ వెళ్ళింది.

ఆ తర్వాత చాలాసార్లు వెళ్ళింది తను చెప్పకుండానే.

తనకి ఆ సెలవుల్లో ఒక టైలర్ షాపులో చిన్న పని దొరికింది. అందుకే అమ్మ మధ్య మధ్యలో కూలి మానేసినా పెద్ద కష్టమవలేదు.

తర్వాత తను టౌను కెళ్ళి ఐ.టి.ఐ. లో చేరాడు. సారా నిషేధం వచ్చింది.

ఆరోజు అమ్మకి ఉత్తరం రాశాడు తను.

తనకి చాలా సంతోషంగా వుండేది.

ఆడాళ్ళు అంత పెద్ద ఉద్యమం.. అంత చక్కగా చేయడం.. చివరికి గెలవడం..

అంతలో అయ్య దగ్గర్నుంచి కబురొచ్చింది, అమ్మ తనని విడిచిపెట్టి ఎళ్ళిపోయిందని.

కంగారుగా వూరికెళ్తే తెలిసింది. సుజాతమ్మగారికి ట్రాన్స్ఫర్ అయ్యిందంట. ఆవిడ హైదరాబాద్ వెళ్తుంటే ఆమెతోపాటూ అమ్మగూడా ఎళ్ళిపోయిందంట. ఎట్టా ఎతకాలో!

*****

ఆలోచనలతో తల పగిలిపోతుంటే కళ్ళు మూసుకున్నాడు నర్సిమ్మ.

మెలకువ వచ్చేసరికి తెలతెలవారుతోంది. బస్ హైదరాబాద్ పొలిమేరల్లో ప్రవేశిస్తోంది.

గౌలిగూడాలో బస్ దిగి ఒక్కక్షణం అయోమయంగా నిలబడిపోయాడు.

ఆ తర్వాత మొహం కడుక్కుని మెల్లగా బయటకి వచ్చాడు. "మహిళాభ్యుదయసమితి" ఆఫీస్ ఎక్కడుందో కనుక్కుని వెళ్ళాడు. సెక్రటరీ కూర్చుని వుంది ఆఫీస్ రూంలో.

వెళ్ళి చెప్పాడు. "సుజాతమ్మగారని, మీ సమితిలో మెంబర్. కొత్తగా హైదరాబాద్ వచ్చారు."

అతను చెప్తూండగానే ఆవిడ తల వూపింది. అడ్రస్ రాసి యిచ్చింది.

అది పట్టుకుని హుషారుగా బయటకి వచ్చాడు. అడ్రస్ అంత సులభంగా తెలిసిపోతుందనుకోలేదు నర్సిమ్మ.

ప్రక్కనే వున్న బండి దగ్గర కాస్త టీ త్రాగి బయల్దేరాడు.

మలక్‌పేట చేరుకునేసరికి ఒంటిగంట అయింది. ప్రచండంగా వున్న సూర్యుడినీ.. ఎండనీ లక్ష్యపెట్టకుండా వెతకసాగాడు.

గంట తిరిగాక కనబడింది.. ముందు సుజాతమ్మ యిల్లు. ఆ తర్వాత కొంచెం దూరంలో అమ్మ వేసుకున్న గుడిసె.

ఎవరో పిల్లల్తో కబుర్లాడుతున్న చెల్లెలు నర్సిమ్మని చూసి లేచి నిలబడింది.

"ఎట్లా వచ్చావు!" అంది ఆశ్చర్యంగా.

మొహం మీది చెమట వత్తుకుంటూ కూలబడ్డాడు నర్సిమ్మ.

"అమ్మేది!"

"కూలికి బోయింది. అన్నం తిన్నావా!"

"లేదు. అన్నముందా!"

తలూపింది. లక్ష్మి అన్నం పెడుతుంటే అడిగాడు. "ఎందుకే యిట్లా వచ్చేశారు!"

"మరేం జెయ్యాలి! అయ్య రోజూ కొడతా వుంటే!"

"కొడితే వచ్చేస్తారా! ఈ రోజు కొత్తగా కొట్టాడా!"

"ఏమో నాకు తెల్వదు" అది మొహం తిప్పుకుంది. "అమ్మొచ్చింది. అమ్మెనక నేనొచ్చా."

"అమ్మయితే యిట్లా రాదు. సుజాతమ్మ తీసుకొచ్చుంటది. కదూ!"

లక్ష్మి చిత్రంగా చూసింది. "లేదన్నా. అమ్మగారు వద్దనే సెప్పారు. అమ్మే

యినకుండా వచ్చింది. ఆమె చాలాసేపు వద్దని చెప్పింది గానీ.. అమ్మ మిమ్మల్నే నమ్ముకున్నా.. మీరే సాయం జెయ్యాల.. అని కాళ్ళమీద పడ్తే, సివరికి ఒప్పుకుంది. టికెట్ కొనిచ్చి ఈడికి తీసుకొచ్చింది. ఆళ్ళింట్లో, ఆళ్ళ బంధువులింట్లో పని సూపించింది."

నర్సిమ్మ మాట్లాడలేదు.

రెండుగంటలు పడుకున్నాడు.

సాయంత్రం ఆరయ్యాక.. అపుడు చెల్లెల్ని తీసుకుని సుజాతమ్మ యింటికి వెళ్ళాడు.

అంట్లు తోముతూన్న యాదమ్మ, కొడుకుని చూడగానే చేతులు కడుక్కుని సంబరంగా ఎదురొచ్చింది.

"అయ్య కలవరిస్తున్నాడే.. యింటికి పోదాం పద" అన్నాడు నర్సిమ్మ.

యాదమ్మ మాట్లాడలేదు. తనకి అలవాటైన మౌనాన్నే ప్రదర్శిస్తూ మళ్ళీ అంట్లు తోముకోసాగింది.

అరగంటపైగా బ్రతిమలాడాడు నర్సిమ్మ. ఈలోపు సుజాత బయటకి వచ్చింది. ఆమె కూడా మరో అరగంట చెప్పింది.

ఎవరేం చెప్పినా.. యాదమ్మ దగ్గర్నుంచి మాత్రం ఒకటే సమాధానం.. మౌనం.

సుజాత మందలించింది. "అసలీ మొండితనమేమిటే నీకు! ఎంతయినా వాడు నీకు మొగుడు. నీ పిల్లలకి తండ్రి. నీమీద వాడికి మాత్రం ప్రేమ వుండదూ! అలా వదిలి వచ్చేయకూడదు. నీకు యిష్టం లేకపోతే అక్కడే వుండి నచ్చచెప్పాలి. ఉద్యమం చెయ్యాలి. అంతేగానీ.."

"..ఎందుకు చెయ్యాలి అమ్మగారూ ఉద్యమం!" అప్పటివరకూ మౌనంగా వున్న యాదమ్మ తలెత్తి అడిగింది.

"ఆడు తాగి ఆరోగ్గెం సెడగొట్టుకుంటా వుంటే, నేను పని మానుకుని ఉద్దెమం

సెయ్యాలా అమ్మగారూ! నా బిడ్డల్ని పస్తులుంచి నేను ఉద్దెమం సెయ్యాలా అమ్మగారూ!

ఆడు తాగితే నాకెంత నట్టమో.. అంతకన్నా ఆడికీ ఎక్కువే నట్టం.

అన్నిరోజులు పని మానుకుని వుద్దెమం జేస్తే.. వూళ్ళో అందరూ బాగుపడినారు గానీ ఈ ఎదవసచ్చినాడు మాత్రం బాగుపడలా. కడుపు మండిపోదా అమ్మగారూ! ఈడు మాత్రం యింకా తాగొస్తున్నాడు. పైగా నన్ను చూసి నవ్వుతున్నాడు..." యాదమ్మ గొంతులోనుంచి ఎక్కిళ్ళు తన్నుకొచ్చాయి.

"అమ్మగారూ! మీరే సెప్పారు. సివరిదాకా వుద్దెమం సెయ్యాలని. ఆరోజు.. సారా పాటలాపినపుడు.. మీరు దెబ్బలు తిన్నారు. నేను దెబ్బలు తిన్నాను. అదంతా అట్టా వూరకే బోవాలా అమ్మా! మీరు బోనిస్తారేమో గానీ నేను బోనివ్వను.

మీరు మీ వుద్దెమం ఆపేసినారు గానీ నేను నా వుద్దెమం ఆపలా. ఆడు పూర్తిగా మారాడని తెలిశాక గానీ నేను మళ్ళీ ఆడి దగ్గరికి ఎళ్ళను.

ఆడికి తెలియాలమ్మా. ఈ మగ సచ్చినాళ్ళందరికీ తెలియాల. వుద్దెమం అంటే అదేందో ఆడోళ్ళదే అనుకుంటున్నారు. ఇదంతా మనకోసవేననుకుంటున్నారు. మనం గెలిసామనో, ఓడామనో పేర్లు పెట్టి నవ్వుకుంటున్నారు. తెలివితక్కువ సన్నాసులు. ఆళ్ళు తాగితే మనకేమన్న రోగాలొస్తయ్యా.. ఏంది!

ఆడి తానుంటేనే నాకా బాధలన్ని. వదిలేసాస్తే.. ఆడి తాగుడుతోటి నాకు గొడవే లేదు. వాడికి మాత్రం రోజంతా బాధే. దాన్నొదిలి పెట్టిందాకా బాధే. ఆ యిసయం ఆడికి తెలిసేదాకా నేనిడ్నే వుంటా.

ఒరే నర్సిమ్మా! నీకిపుడే సెప్తున్నా. నేనెక్కడున్నానో అయ్యకి తెలిసేందుకు ఈల్లేదు. తెలిసిందంటే నేనీడ వుండను. ఏంది అర్థమయిందా!"

*బి. శ్రీవల్లి రాధిక*

ఎపుడూ నోరు తెరిచి ఒకమాటయినా మాట్లాడని యాదమ్మ అలా గదమాయిస్తుంటే.. నర్సిమ్మ అయోమయంగా చూస్తూ తలవూపాడు. సుజాతకయితే ఆశ్చర్యంతో నోటమాట కూడా రాలేదు.

"నేనెల్తానే అయితే" అన్నాడు నర్సిమ్మ ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"రేపొద్దున పో. యిదిగో, ఆ షాపులోకెళ్ళి నాలుగు గుడ్లు పట్టుకురా." నర్సిమ్మ చేతికి డబ్బులిచ్చి, అన్నం గిన్నె బుట్టలో పెట్టుకుని, "పోయొస్తానమ్మగారూ!" అంటూ బయటకి నడిచింది యాదమ్మ.

"సిరంజీవి సిన్మా ఆడుతుందీడ. సూస్తావా!" కొడుకు తల నిమురుతూ మురిపెంగా అడుగుతున్న యాదమ్మని చూస్తుంటే.. సుజాత పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

వెళ్ళొస్తానని చెప్పేందుకు వెనుదిరిగిన నర్సిమ్మ కళ్ళకు అది అర్థమై, ఆనందబాష్పాలు జలజలా రాలాయి.

*****

("సుప్రభాతం" - 05 మార్చి 1996)